క్లుప్తంగా

సబ్ పోస్టాఫీసులో ఆధార్ సేవలు పునఃప్రారంభం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని రామగిరి సబ్ పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు పునఃప్రారంభమైనట్లు సూపరింటెండెంట్ కె.రఘునాథస్వామి తెలిపారు. ఆధార్ నవీకరణ, సవరణ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు ఉచితంగా ఆధార్ కార్డు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఫిజికల్ డైరెక్టర్‌గా గిరిబాబు

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని బొట్టుగూడ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్‌గా బొమ్మపాల గిరిబాబు నియమితులయ్యారు. గతంలో దాదాపు 10 సంవత్సరాల పాటు ఇదే పాఠశాలలో ఆయన పీఈటీగా బాధ్యతలు నిర్వర్తించారు. పాఠశాలకు క్రీడా ప్రాంగణం లేకపోవడంతో ఎన్జీ కళాశాల మైదానంలో క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కనగల్ : పొనుగోడు గ్రామపంచాయతీ పరిధిలో 400 కేవీ విద్యుత్ టవర్ లైన్ పనులు జరుగుతున్నందున మంగళవారం నుంచి ఈ నెల 28 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖరచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు పొనుగోడు, రామచంద్రపురం, కురంపల్లి గ్రామ పరిధిలో 3 ఫేజ్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మర్రిగూడ : మండల కేంద్రంలోని బీసీ వసతి గృహంలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వసతి గృహ వార్డెన్ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. వివరాలకు 9492558568 నంబర్ సంప్రదించాలన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం

మునుగోడు: రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ సింగారంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి చిత్రపటాలకు సోమవారం కాంగ్రెస్, సీపీఐ నాయకులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో దేప జాన్‌రెడ్డి, కుంభం చెన్నారెడ్డి, సోమగోని సంతోష్, పోగుల ప్రకాష్, కుంభం భూపాల్‌రెడ్డి, గుంటుక కృష్ణయ్య, జంగం రాములు, నారాయణరెడ్డి, యంపల్ల వెంకన్న, అర్జున్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని వినతి

నల్లగొండ టౌన్ : విద్యా హక్కు చట్టాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి రాజ్యలక్ష్మికి మాదిగ రిజర్వేషన్ పోరాట సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చేకూరి గణేశ్, జిల్లా అధ్యక్షుడు ముదిగొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులకు 25 శాతం ఉచితంగా సీట్లను జిల్లా పరిధిలో ఉన్న ప్రతి ప్రైవేటు పాఠశాలలో అమలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. "కార్యక్రమంలో పుట్టల సందీప్, నారపాక అంజి, అంజయ్య పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నల్లగొండ రూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయు ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో మండల ప్రత్యేక ధికారి నవీన్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పోలె సత్యనారాయణ, అధ్యక్షుడు రాములు, ఎల్లేష్, కళావతి, భారతమ్మ, నర్సింహా, లక్ష్మమ్మ, నవనీత, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శాంతి కల్యాణం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణం పానగల్‌లోని శంకర గోశాల శ్రీ ప్రహ్లాద వరద లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాపోలు శ్రీనివాస్, రామాంజనేయులు, గణేశ్, బాల కిషన్, విజయ మోహన్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి పూజ

నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు మర్రిగూడ వద్ద గల శ్రీ కల్యాణ కనకదుర్గమ్మ ఆలయం ప్రథమ వార్షికోత్సవం, బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం గణపతిపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ చైర్మన్ జెర్రిపోతుల సైదులుగౌడ్, సభ్యులు జెర్రిపోతుల శ్రీ దుర్గా, కార్తీక్‌గౌడ్, ఋత్విక్, ఉదయ్‌కుమార్, అర్చకులు తిరందాసు శ్రవణ్, సురికి మారయ్య, కలగోని శ్రీను పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి
- మండల కేంద్రాల్లో ప్రజావాణి ప్రారంభం
- దరఖాస్తులు స్వీకరించిన అధికారులు



నాంపల్లి : : ప్రజావాణి కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి



నకిరేకల్ : దరఖాస్తుదారుడి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వీరేశం

నాంపల్లి : ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. నాంపల్లిలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి గ్రామం అంతటికీ నాయకత్వం వహించాలని సూచించారు. ప్రతి సోమవారం మండల కేంద్రంలో జరిగే ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి ఫిర్యాదును స్వీకరించి సమస్యలను పరిష్కరించవలసిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందన్నారు. గ్రామ పంచాయతీ మినీ కలెక్టరేట్ కావాలన్నారు. మండలంలో ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం దరఖాస్తులు 49 రాగా.. అందులో 33 ధరణి సమస్యలపైనే వచ్చాయి. కార్యక్రమంలో చండూర్ ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, ఎంపీపీ ఏడుదొడ్ల శ్వేతారవీందర్‌రెడ్డి, తహసీల్దార్ దేవసింగ్, ఎంపీడీఓ స్వర్ణకుమారి, మండల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజావాణి వేదిక

నకిరేకల్ : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి ఒక వేదిక లాంటిందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వృద్ధులు, దివ్యాంగులు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి దూరభారంతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఇకపై మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలకు మండల కేంద్రంలోనే ప్రజావాణి ద్వారా తక్షణ పరిష్కారం మార్గం చూపుతామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కోటేశ్వరరావు, ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్‌రావు, ఎంపీడీఓ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ బాలయ్య, తహసీల్దార్ జమురుద్దీన్, ఎంఈఓ మేకల నాగయ్య పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ సందర్శన

నకిరేకల్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర సందర్శించారు. ప్రజల నుంచి దరఖాస్తులు ఎలా తీసుకుంటున్నారు.. కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేసి రశీదు ఇస్తున్నారా అని ఆరా తీశారు. అనంతరం మండల స్థాయి అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు.

15 రోజుల్లో పరిష్కరించాలి

నార్కట్‌పల్లి : ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తుదారుల సమస్యలను 15 రోజుల్లో పరిష్కరించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ పూర్ణచంద్ర అన్నారు. సోమవారం నార్కట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయన హాజరై దరఖాస్తులను పరిశీలించి మాట్లాడారు. మండలంలో ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువగా వచ్చినట్లు తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రమేష్, ఎంపీడీఓ కె.ఉమేష్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీఓ సుధాకర్, పీఆర్ డీఈ మహేష్, ఎంఈఓ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి ప్రజావాణిలో 36 ఫిర్యాదులు

ప్రజావాణి కార్యక్రమంలో నార్కట్‌పల్లి మండలంలో వివిధ సమస్యలపై 36 ఫిర్యాదులు వచ్చినట్లు ఎంపీడీఓ ఉమేష్ తెలిపారు. రెవెన్యూ శాఖ-23, పంచాయతీరాజ్-8, విద్యుత్-2, ఆర్అండ్‌బీ సమస్యలపై 3 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు.

అధికారులు సేవకుల్లా పనిచేయాలి

కట్టంగూర్ : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సేవకుల్లా పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నల్లగొండ ఆర్డీఓ రవి మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించుకోవాలని సూచించారు. రెవెన్యూకు సంబంధించి 3, ఆల్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన 4, ఇతర సమస్యలపై 2 చొప్పున మొత్తం 9. దరఖాస్తులు వచ్చినట్లు మండల ప్రత్యేక అధికారి విజయేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు, తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీఓ సన్నిఅబ్రహం, ఏఈలు జమీల్ అహ్మద్, నవీన్, ఆర్ఎస్‌జే కుమార్, సూపరింటెండెంట్ చలపతి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలి

చిట్యాల: ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరిస్తున్న దరఖాస్తుదారుల సమస్యలను అధికారులు వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) పూర్ణచంద్ర అన్నారు. చిట్యాల ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దరఖాస్తుదారులకు వెంటనే రశీదులు అందజేయాలన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల వివరాలను సకాలంలో జిల్లా అధికారులకు అందించాలని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 61 దరఖాస్తులు రాగా వీటిలో 28 రెవెన్యూ విభాగానికి సంబంధించినవి కాగా 33 ఆసరా పింఛన్ దరఖాస్తులు వచ్చాయి. అనంతరం వర్షాకాల సీజన్‌లో రోగాలు ప్రబలకుండా ఏవిధమైన చర్యలు తీసుకుంటున్నారని చిట్యాల వైద్యాధికారి డాక్టర్ అజాహర్‌ను అడిషనల్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ప్రతిరోజు ఓపీ ఎంత, మందుల స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ సర్వేను వేగవంతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ జయలక్ష్మీ, ఎంపీడీఓ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ వీరేందర్, అధికారులు పాల్గొన్నారు.

చండూరు : ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చండూరు ఆర్డీఓ సుబ్రహ్మణ్యం అన్నారు. చండూరు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు.

గట్టుప్పల్...

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తోందని జిల్లా పంచాయతీ అధికారి కే మురళి అన్నారు. గట్టుప్పల్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. నోడల్ అధికారి మాధవరెడ్డి, తహసీల్దార్ రాములు, ఏఈ ప్రవీణ్ రెడ్డి, కార్యదర్శి షఫీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివేష పాల్గొన్నారు

నల్లగొండ మండలంలో 30 దరఖాస్తులు...

నల్లగొండ రూరల్: నల్లగొండలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 30 దరఖాస్తులు అందాయి. మండల ప్రత్యేక అధికారి నవీన్‌కుమార్, ఎంపీడీఓ శ్రీనివాస్‌లు దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈఓ అరుంధతి, ఎంపీఈఓ ముజీబ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షఫీ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని..

అర్హులైన పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున సోమవారం నల్లగొండ ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌డేలో వినతి పత్రం అందజేశారు. పెద్దసూరారంలో 540 సర్వే నంబర్ గల భూమి అన్యాక్రాంతం కాకముందే ఇళ్లులేని పేదలకు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో పోలె సత్యనారాయణ, దొండ కృష్ణారెడ్డి, కొండ వెంకన్న, బొల్లు రవీందర్, మల్లెబోయిన రామలింగయ్య, కట్ట అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



మునుగోడు: ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి



చిట్యాల : ప్రజావాణి కార్యక్రమంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ పూర్ణచంద్ర

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

మునుగోడు: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి ప్రేమ్‌కరణ్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో అన్నిశాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు దరఖాస్తులు చేసిన వెంటనే సమస్య పరిష్కారానికి చొరవ చూపుతారన్నారు. మొదటి రోజు మునుగోడు మండలంలో మొత్తం 22 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. అందులో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 10, విద్యుత్ శాఖ-3, పంచాయతీ రాజ్ శాఖ దరఖాస్తులు 9 వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.నరేందర్, ఎంపీడీఓ పూజ, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణితో సమస్యలు పరిష్కారం

కేతేపల్లి: ప్రజావాణి కార్యక్రమంతో ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర పరిష్కారం లభిస్తుందని నియోజకవర్గ ప్రత్యేక అధికారి కోటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు 15 రోజుల్లో పరిష్కారం చూపాలని మండల అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో వివిధ సమస్యలకు సంబంధించి 27 మంది దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. నల్లగొండ ఆర్డీఓ రవి ప్రజావాణి కార్యక్రమాన్ని సందర్శించి ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, మండల ప్రత్యేక అధికారి నాగేశ్వరావు, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, తహసీల్దారు మధుసూదన్‌రెడ్డి, ఏఓ బి.పురుషోత్తం, ఎంపీఓ నాగమణి, మండల వైద్యాధికారి అర్చన ఏపీఎం బి.యాదమ్మ, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులకు పరిష్కారం చూపాలి

నల్లగొండ టూటౌన్ : ప్రజావాణి ద్వారా ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులకు పరిష్కారం చూపాలని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ అన్నారు. సోమవారం నీలగిరి మున్సిపల్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించగా మొత్తం 15 దరఖాస్తులు వచ్చాయి. వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ రాములు, ఏసీపీ నాగిరెడ్డి, వివిధ విభాగాల ఉద్యోగులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తిప్పర్తి ప్రజావాణిలో 27 దరఖాస్తులు

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 27 మంది దరఖాస్తులు చేసుకున్నారు. రెవెన్యూ-22, ఆర్‌డబ్ల్యూఎస్-1, పంచాయతీరాజ్- 3, ఇరిగేషన్ సమస్యలపై ఒకరు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో తిప్పర్తి మండల ప్రత్యేక అధికారి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ ఎమ్. భూమన్న, ఎంపీడీఓ ఎ.వెంకటేశ్వరరెడ్డి, తహసీల్దార్ డి.స్వప్న, ఎంఈఓ అరుంధతి, ఎంపీఓ జానయ్య, మండల అధికారులు పాల్గొన్నారు.

కనగల్‌లో 25 దరఖాస్తులు

కనగల్ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ప్రజల నుంచి 25 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ జయరామ్ తెలిపారు. 20 రెవెన్యూ, 4 పింఛన్లు, ఒకటి ఎక్సైజ్ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ పద్మ, వ్యవసాయాధికారి అమరేందర్‌గౌడ్, ఏఈ శ్రీనివాస్, రాఘవచారి, షఫీ, వైద్యాధికారి వరూధిని, పశువైద్యాధికారి డాక్టర్ బాబు, ఎంపీఓ సుమలత వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి నాలుగు దరఖాస్తులు

మర్రిగూడ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి కేవలం నాలుగు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. అందులో రెండు రెవెన్యూ, ఒకటి విద్యుత్, మరొకటి ఖుదాబక్షపల్లి గ్రామానికి చెందిన దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మునుగోడు ఏడీఏ ఎల్లయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ జి.చినమునయ్య, సూపరింటెండెంట్ యాకుబ్, ఎంపీఓ రవికుమార్ పాల్గొన్నారు.



నీలగిరి మున్సిపల్ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్



గట్టుప్పల్‌లో దరఖాస్తు స్వీకరిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి మురళి

బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ధర్నా

నల్లగొండ రూరల్: అనుమతి లేని విద్యా సంస్థలను సీజ్ చేయాలని కోరుతూ సోమవారం నల్లగొండలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్‌గౌడ్, కర్నాటి యాదగిరి, నరేష్‌గౌడ్, కొంపల్లి రామన్నగౌడ్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

చండూరు(గట్టుప్పల్) : నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు వాహనాలు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం రాత్రి బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై దాడులు నిర్వహించారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

నకిరేకల్ : పేదలకు ఇంటి స్థలాలు, పక్కా గృహాలు ఇవ్వాలని పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి ప్రభుత్వాన్ని కోరారు. నకిరేకల్ మండలం నోములు గ్రామంలో సోమవారం ఆయన నిరుపేదలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ భూములు పేదలకు పంపిణీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు గ్యార సాలయ్య, మాచర్ల ఎల్లయ్య, గ్యార పీరయ్య, మామిడి భిక్షం, మాచర్ల గోపి, పరమేషం, ఎర్ర ప్రమీల పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేత



నియామకపత్రం అందిస్తున్న మోహన్‌రెడ్డి

నల్లగొండ: విద్యార్థులు ఎన్ఎస్‌యూఐ బలోపేతంతోపాటు చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఎన్ఎస్‌యూఐ పట్టణ నూతన కమిటీని ప్రకటించి నియామక పత్రాలు అందజేసి మాట్లాడారు. ఎన్ఎస్‌యూఐ పట్టణ ఉపాధ్యక్షులుగా పి.గురువేందర్, ఎస్.కె అనీఫ్, ప్రధాన కార్యదర్శులుగా కే.శ్రీకాంత్, సీహెచ్.సంకీర్త్ రెడ్డి, ఆర్. మణికంఠ, కార్యదర్శులుగా వి.వరుణ్ తేజ్, సీహెచ్.సునీల్, కోఆర్డినేటర్లుగా ఎన్.నిఖిల్, వి.సతీష్‌లను నియమించారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి.నాగార్జున, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.సాయితేజ్, జిల్లా కార్యదర్శి భైరు ప్రసాద్, నియోజకవర్గ అధ్యక్షుడు మనిమద్దె సాయిరాం, పట్టణ అధ్యక్షుడు కొండా శరత్, జి.సాయి తదితరులు పాల్గొన్నారు.

'కుటుంబ కలహాలతోనే ఆత్మహత్య'

నకిరేకల్: మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన జిల్లా నాగయ్య(38) ఈ నెల 21 తేదీన తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం విది తమే. నాగయ్య మృతిపై నల్లగొండ ఆర్డీఓ ఆదేశాల మేరకు నకిరేకల్ ఆర్ఐ ప్రవీణ్ విచారణ చేసి జిల్లా అధికారులకు నివేదిక సమర్పించారు. నాగయ్య అప్పుల బాధతో మృతి చెందలేదని తన భార్య మధ్య వివాదాల కారణంగా జరిగిన గొడవలో అవమానం భరించలేక ఉరి వేసుకున్నాడని ఆర్ఐ ప్రవీణ్ వెల్లడించారు.

నోట్‌బుక్స్ పంపిణీ



నార్కట్‌పల్లి : విద్యార్థులతో రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి

నార్కట్‌పల్లి : తన కుమారుడు రేగట్టె దినేష్‌రెడ్డి జయంతి సందర్భంగా రేగట్టె దినేష్ సేవా సమితి ఆధ్వర్యంలో చెర్వుగట్టు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి సోమవారం విద్యార్థులకు నోట్ బుక్స్, షూ, బ్యాగులు, యూనిఫాం అందజేశారు. చెర్వుగట్టు ఆలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, మాజీ సర్పంచ్‌లు మల్ల బాలకృష్ణ, రమణ, కొత్త నర్సింహా, రామకృష్ణ, ఎంపీటీసీ పుల్లెంల ముత్తయ్య, రేగట్టె మహేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ, ఉపాధ్యాయులు పద్మ, సుమ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి : దేవత్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ,హెచ్ఎం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని ఫిర్యాదు

నార్కట్‌పల్లి : స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కేటాయించిన స్థలం ఆక్రమణకు గురైందని మాజీ జెడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. 10 గుంటల భూమి రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేశారని ఆరోపించారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి



కట్టంగూర్ : విద్యార్థిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూర్ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో పదో తరగతి ఫలితాల్లో 9.7 జీపీఏ సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ.4వేల నగదు, వెయ్యి రూపాయల బహుమతి, ప్రతి హైస్కూల్‌లో టాపర్‌లుగా నిలిచిన విద్యార్థులకు మెమొంటో, ప్రశంసా పత్రాలను అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ జీపీఏ సాధించిన విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, ఎంఈఓ మేక నాగయ్య, ఎంపీటీసీ మాద యాదగిరి, హెచ్ఎం అంబటి అంజయ్య, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎడ్ల సైదులు, పెరుమాళ్ల వెంకటేశం, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ మురళయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, పెద్ది యాదగిరి, ఆయా పాఠశాలల హెచ్ఎంలు ఉన్నారు.

కరాటే పోటీల బ్రోచర్ విడుదల

నకిరేకల్ : నకిరేకల్ కరాటే డో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 4వ తేదీన నకిరేకల్ పట్టణంలో నిర్వహించనున్న 38వ నేషనల్ షాటోకాన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల ప్రచార బ్రోచర్‌ను సోమవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం విడుదల చేశారు. ఈ పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి 800 మంది విద్యార్థులు పాల్గొంటారని కరాటే తెలంగాణ చీఫ్ ఇన్‌స్పెక్టర్ రాపోలు సుదర్శన్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ, టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ అంతటి సోములు గౌడ్, కరాటే మాస్టర్లు ఆర్.విజయ్‌కుమార్, ఎలయ్య, అంజి, చెన్న కేశవులు, సత్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నల్లగొండ టౌన్ : నల్లగొండలోని గీతా విజ్ఞాన్ పాఠశాలకు చెందిన 1987 విద్యా సంవత్సరం ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు హైదరాబాద్‌లోని ఇబ్రహీంపట్నంలో సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో రామశర్మ, తేలుకుంట్ల శ్రీనివాస్, శివప్రసాద్, మొగిరాల శ్రీనివాస్, లవకుమార్ పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి

నల్లగొండ టూటౌన్ : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయడానికి జాబ్ క్యాలెండర్ వెంటనే ప్రకటించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వంగూరి రాఖీ డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని హైదరాబాద్‌లో నిరసన తెలిపితే బీజేవైఎం రాష్ట్ర నాయకులపై ప్రభుత్వం పోలీసులతో దాడులు చేయించడాన్ని ఖండిస్తూ సోమవారం నల్లగొండ పట్టణంలోని సుభాష్ విగ్రహం వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలని, గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి అభిలాష్, రాంబాబు, భరత్, ముంత సైదులు, అజయ్, కానుగ గోపి, లోహిత్‌రెడ్డి, దుబ్బాక సాయి పాల్గొన్నారు.



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేవైఎం నాయకులు

'తండా'లో చెత్త సేకరణ

సాక్షి ఎఫెక్ట్..

మర్రిగూడ : మండలంలోని రాజాపేటతండాలో 15 రోజులుగా చెత్తను సేకరించకపోవడంతో 'పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం'అనే కథనం సాక్షి దినపత్రికలో ఈ నెల 18న ప్రచురితమైంది. స్పందించిన అధికారులు రాజాపేటతండా గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ జి.చినమునయ్య చొరవతో గ్రామపంచాయతీ ట్రాక్టర్‌కు సుమారు మరమ్మతులు చేయించారు.

కేసు నమోదు

నాంపల్లి : మండలంలోని కేతపల్లి గ్రామానికి చెందిన వడ్లకొండ రామచంద్రం అనే వ్యక్తి భూతగాదాలతో తన సొంత అన్న వడ్లకొండ సత్తయ్యపై గొడ్డలితో సోమవారం తన వ్యవసాయ పొలం వద్ద హత్యాయత్నం చేశాడు. దీంతో కుటుంబ సభ్యులు అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన అనంతరం అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ లచ్చిరెడ్డి తెలిపారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన డ్వాబ్ ప్రతినిధులు



కిషన్‌రెడ్డితో డ్వాబ్ ప్రతినిధులు

నల్లగొండ టూటౌన్ : కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని సోమవారం ఢిల్లీలో డ్వాబ్ ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్‌సీఐ వంటి సంస్థలకు సలహాదారుడిగా పొనుగోటి చొక్కారావును నియమించాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. స్వామినాయక్, ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు కె. రాములు పాల్గొన్నారు.